ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్


జంగారెడ్డిగూడెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ


బ్యాలెట్ బాక్సులకు సీల్ వేసి తరలిస్తున్న దృశ్యం


పోలీసు బందోబస్తు, ఎన్నికల సిబ్బంది


ఓటు వేసేందుకు వచ్చిన ఎంపీపీ బి. మోహిని, ఎంపీటీసీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం డీఎస్పీ కేవీ సత్యనారాయణ, పోలవరం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, 10 మండలాలకు సంబంధించిన జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిలర్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, అబ్జర్వర్లు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు దేవరకొండ అఖిల, రమలు పరిశీలించారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ పరిశీలించి స్థానిక నాయకులతో పోలింగ్ సరళిపై చర్చించారు.

ఓటు హక్కును వినియోగించుకున్న 180 మంది ఓటర్లు

జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో 184 మంది ఓటర్లు ఓటు వేయాల్సి ఉండగా, 180 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. జంగారెడ్డిగూడెంలో ఓటు హక్కును వినియోగించుకున్నవారిలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యేలు వీఆర్ ఎలీజా, తెల్లం బాలరాజు తమ ఓటును వినియోగించుకున్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలో ఉన్న 29మంది కౌన్సిలర్లు, మండలంలో ఉన్న ఎంపీటీసీలు 18మంది ఓటు వేశారు. కుకునూరు మండలం నుంచి 10 మంది ఎంపీటీసీలు, జీలుగుమిల్లి మండలం నుంచి 9మంది ఎంపీటీసీలు, పోలవరం మండలం నుంచి 13మంది ఎంపీటీసీలు, కొయ్యలగూడెం మండలం నుంచి 19 మంది ఎంపీటీసీలు, టి.నరసాపురం మండలం నుంచి 16మంది ఎంపీటీసీలు, కామవరపుకోట మండలం నుంచి 16మంది ఎంపీటీసీలు, ద్వారకాతిరుమల మండలం నుంచి 19మంది ఎంపీటీసీలు, బుట్టాయగూడెం మండలం నుంచి 15మంది ఎంపీటీసీలు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, ఈ 10 మండలాల జెడ్పీటీసీలు ఓటు వేశారు.

నలుగురు గైర్హాజరు

మొత్తం 184 మంది ఓటర్లు ఉండగా, 180 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా, 4 ఎంపీటీసీలు తమ ఓటును వినియోగించుకోలేదు. వీరిలో వేలేరుపాడు మండలం మేడేపల్లి ఎంపీటీసీ సభ్యుడు తుర్రం తమ్మయ్య, ఈయన సీపీఐఎంఎల్ పార్టీకి చెందిన వారు. వేలేరుపాడు మండలం కామవరం ఎంపీటీసీ సభ్యుడు సోయం చంద్రం సీపీఐ ఎంఎల్ పార్టీకి చెందిన వారు. బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెం ఎంపీటీసీ కొవ్వాసి జోగేంద్రరాజు, ఇండిపెండెంట్ సభ్యుడు, బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడెం ఎంపీటీసీ సభ్యురాలు మడకం వెంకటలక్ష్మి తమ ఓటును వినియోగించుకోలేదు.

టీడీపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది



జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ శ్రేణులందరూ వచ్చి ఎమ్మెల్సీ ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ స్థానానికి సుమారుగా 1,100కు పైగా ఓట్లు ఉండగా, వైసీపీ నుంచి గెలిచిన అభ్యర్థులు 950 వరకు ఉన్నారు. టీడీపీకి గెలవడానికి అవకాశం లేని పరిస్థితి. ఏకగ్రీవంగా గెలుపొందాల్సిన స్థానాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ పోటీ పెట్టారు. పోటీని మేము కూడా ఆహ్వానిస్తున్నాం. అయితే నేరుగా టీడీపీ నుంచి అభ్యర్థిని నిలబెట్టి ఉంటే బాగుండేది. ఇండిపెండెంట్ అభ్యర్థిని నిలబెట్టారు. వారు తెర వెనుక రాజకీయాలు చేయడం విచారించదగ్గ విషయం. ఇటువంటి రాజకీయాలు చేస్తే భవిష్యత్తులో 2, 3 స్థానాలకే పరిమితం కావాల్సి ఉంటుంది.

– వీఆర్ ఎలీజా, ఎమ్మెల్యే, చింతలపూడి నియోజకవర్గం

ప్రశాంతంగా ఎన్నికలు



జంగారెడ్డిగూడెం: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా రెండు పోలింగ్ కేంద్రాలు ఏలూరు, జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేశాం. మొత్తం 433 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. రెండు పోలింగ్ బూత్‌లలో డీఎస్పీ స్థాయి అధికారులు ఇన్‌ఛార్జ్‌గా నియమించాం. జంగారెడ్డిగూడెంలో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ పర్యవేక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 413మంది రెండు పోలింగ్ బూత్‌లలో బందోబస్తు నిర్వహించాం. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 10 బోర్డర్ చెక్ పోస్టుల్లో తనిఖీలు నిర్వహించాం. ప్రతి మండలంలో స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేసి శాంతి భద్రతలు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నాం.

– రాహుల్‌దేవ్ శర్మ, ఎస్పీ, ఏలూరు జిల్లా

వైఎస్సార్ సీపీ అభ్యర్థులు అఖండ మెజార్టీతో గెలుస్తారు



జంగారెడ్డిగూడెం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటాలో బలపర్చిన అభ్యర్థులు కౌరు శ్రీనివాస్, వంకా రవీంద్ర వైఎస్సార్ సీపీ తరుపున పోటీ చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారి విజయం తథ్యం. కుట్ర, కుతంత్ర రాజకీయాలకు కేరాఫ్‌గా ఉన్న ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడుకి ఓడిపోతామని తెలిసినా కావాలని అభ్యర్థులను పోటీలో పెట్టి నీచ రాజకీయాలకు ఒడిగట్టారు. ఎన్ని కుతంత్రాలు చేసినా కవురు శ్రీనివాస్, వంకా రవీంద్ర అఖండ మెజార్టీతో గెలుస్తారు. ప్రజాస్వామ్యంలో నీచరాజకీయాల చోటు లేదు. చంద్రబాబు ఎప్పుడూ ముఖాముఖీ రాజకీయాలు చేయలేదు. వెన్నుపోటు, తెరవెనుక రాజకీయాలే చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు నమ్మకంతో ఉన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలే కాదు, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సైతం 175 నియోజకవర్గాల్లో వైసీపీ గెలుస్తుంది. సీఎం జగన్ హామీలను నెరవేర్చడంతోపాటు ఎన్నో పథకాలను అందిస్తున్నారు. అవినీతి, దళారులు లేకుండా కుల, మత, వర్గాలకు అతీతంగా పథకాలను అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే , పోలవరం నియోజకవర్గం

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యే తలారి పరామర్శ

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత నల్లూరి బాపనయ్యను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సోమవారం పరామర్శించారు. బాపనయ్య తల్లి నాగభూషణమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 5న మృతి చెందారు. దీన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే తలారి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, నల్లజర్ల సొసైటీ ఛైర్‌పర్సన్ కారుమంచి రమేష్‌తో కలిసి ఆయన నివాసానికి వెళ్లి ముందుగా నాగభూషణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం బాపనయ్యను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో భోగరాజు చిన్నచిన్ని, నల్లూరి వెంకన్నబాబు, బోయపా రామ్మోహన్‌రావు, ఎలమర్తి సీతారామయ్య, సర్పంచ్ యంట్రపాటి సునీల్, పడమట ఏసు తదితరులున్నారు.

బ్యారన్ దగ్ధం


100 రామన్నపాలెంలో దగ్ధమవుతున్న బ్యారన్

టి.నరసాపురం: ప్రమాదవశాత్తు బ్యారన్ దగ్ధమైన ఘటనలో సుమారు రూ. 2లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు చింతలపూడి అగ్నిమాపక అధికారి టి.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని 100 రామన్నపాలెంకు చెందిన బండారు పాపారావు వర్జీనియా పొగాకు బ్యారన్‌లో క్యూరింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం క్యూరింగ్ జరుగుతుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి బ్యారన్ దగ్ధమైందన్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

ప్రతి ప్రజాప్రతినిధీ వైఎస్సార్ సీపీకే ఓటు వేస్తారు

జంగారెడ్డిగూడెం: స్థానిక సంస్థల ప్రతినిధులకు సరైన గౌరవం, సముచిత స్థానం వైసీపీ హయాంలోనే నెరవేరిందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. విధులు, నిధులు విషయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు ప్రాధాన్యత కల్పించారని అన్నారు. జెడ్పీటీసీల విషయానికి వస్తే ప్రతి ఒక్కరికీ రూ.కోటి నిధులు కేటాయించారని తెలిపారు. ఎంపీటీసీలకు సైతం పుష్కలంగా నిధులు కేటాయించారని అన్నారు. జగన్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్క ప్రజాప్రతినిధీ వైఎస్సార్ సీపీకే ఓటు వేస్తారని ఆయన పేర్కొన్నారు. 1,050 మంది కవురు శ్రీనివాస్‌కు మొదటి ప్రాధాన్యత, వంకా రవీంద్రకు రెండో ప్రాధాన్యత ఓటు వేసి వైసీపీ అభ్యర్థులను గెలిపించనున్నారని బాబ్జి అన్నారు.

కన్నాయిగుట్ట బాధితులకు వలంటీర్ల వితరణ

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలోని కన్నాయిగుట్టలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన అగ్ని బాధితులకు దాతలు సాయం అందిస్తున్నారు. సోమవారం వేలేరుపాడు వలంటీర్లు 27 గిరిజన కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 500 చొప్పున 13,500 నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిర్లాపురం సర్పంచ్ సోడే విజయ, సీపీఐ నేత కారం దారయ్య, వలంటీర్లు నాగు, బాలు, బంగారుబాబు, నాగేంద్రబాబు, మడకం వెంకమ్మ, స్పందన, సీత తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన తహసీల్దార్


పట్టిసం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ బి.సుమతి

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల గ్రామంలోని ఎత్తిపోతల పథకం పనితీరును తహసీల్దార్ బి.సుమతి సోమవారం పరిశీలించారు. పథకం నిర్వహణ, ఖర్చులు పరిస్థితిని నిర్వాహకుల నుంచి తెలుసుకున్నారు. మోటార్ల పరిస్థితి, రెండు పంటలకు సాగునీరు అందుతుందా లేదా అనే విషయాలను రైతులతో చర్చించి తెలుసుకున్నారు. పట్టిసంలో ఎత్తిపోతల పథకం పనుల పరిస్థితిని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె

చింతలపూడి: చింతలపూడి మండలం, సీతానగరంలోని పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికులు సోమవారం రాత్రి మెరుపు సమ్మెకు దిగారు. ఉద్యోగులకు, కార్మికులకు చెల్లించాల్సిన ఇంక్రిమెంట్లు, జీతాల పెరుగుదల విషయంలో ఫ్యాక్టరీ యాజమాన్యం సంవత్సరాల తరబడి అన్యాయం చేస్తోందని ఆరోపిస్తూ గేటుముందు ఆందోళన చేపట్టారు. కార్మికుల సమ్మెకు సీఐటీయూ సంఘీభావం ప్రకటించి ఆందోళనలో పాల్గొన్నారు. జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఆర్‌వీ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు నత్తా వెంకటేశ్వరరావు సమ్మెకు సంఘీభావం తెలిపారు.

యువతకు చట్టాలపై అవగాహన అవసరం


జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై మాట్లాడుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: సైబర్ నేరాలు, లోన్ యాప్‌ల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల ఎస్.ప్రసాద్‌బాబు అన్నారు. జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు, దిశా చట్టం, లోన్ యాప్‌లపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కళాశాల ఆంగ్ల శాఖ, జంగారెడ్డిగూడెం సచివాలయం సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువతకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం దిశ చట్టం కోఆర్డినేటర్, ఉమెన్ పోలీస్ మౌనిక విద్యార్థినీ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గతంలో బాల్యవివాహాలు, భ్రూణ హత్యలు, స్త్రీ నిరక్షరాస్యత వంటి సామాజిక రుగ్మతలు ఎక్కువగా ఉండేవని వాటి స్థానంలో, ఆధునిక కాలంలో స్త్రీలకు వరకట్న వేధింపులు, గృహ హింస, ప్రేమ పేరుతో మోసానికి గురికావడం, స్త్రీల అక్రమ రవాణా సైబర్ నేరాలు, వ్యక్తిగత సమాచారాన్ని మార్ఫింగ్ చేసి బెదిరించడం వంటి ఎన్నో దురాగతాలు జరుగుతున్నాయన్నారు. వాటి పట్ల యువతీ యువకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. యువత రుణాల యాప్స్ వలలో పడవద్దని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ లక్ష్మి మాట్లాడుతూ సైబర్ నేరరాలు గురించి ఫిర్యాదు చేయడానికి 1930 నంబరు, అత్యవసర సమయాల్లో 181, 112, 100 నంబర్లను ఉపయోగించి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దిశ యాప్, ఫోక్సో చట్టాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, పి.సన్యాసిరావు, డాక్టర్ బదరీ నారాయణ, వెంకటాచార్యులు, డాక్టర్ వెంకట్ లాల్, గంగాధర్, హనుమంతరావు, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతల సహాయంతో తాగునీటి బోర్ల నిర్మాణం


కొయ్యలగూడెం సమీపంలో తాగునీటి బోరు నిర్మిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలో తాగునీటి బోర్లు నిర్మాణం ప్రారంభించినట్లు సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి సోమవారం పేర్కొన్నారు. లివింగ్ సాక్రి ఫైజ్ మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ మల్లిపూడి దేవ సహాయం, ట్రెజరర్ ప్రేమ కుమారి దంపతుల ఆర్థిక సాయంతో పనులను ప్రారంభించమన్నారు. బోర్ల నిర్మాణానికి సంస్థ రూ.20 లక్షలు పంచాయతీకి విరాళంగా అందజేసిందని అన్నారు. తారకరామా నగర్, చేపల పేట, బ్రహ్మల కాలనీ మొత్తం మూడు చోట్ల తాగునీరు కొరకు బోర్లు వేయించమని పంచాయతీ అభ్యర్థన మేరకు దాతలు స్పందించారన్నారు. బోర్లు నిర్మాణంతోపాటు తాగునీటి ట్యాంకులను ఆయా ప్రాంతాల్లో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎస్‌ఎం సంస్థ సిబ్బంది సామ్యూల్ కనకరాజు, సోమేశ్వరరావు, దుర్గాప్రసాద్, కృష్ణ కాంత్, వార్డు మెంబర్లు బూసి త్రిమూర్తులు, ఎస్ఎస్ గణేష్ పాల్గొన్నారు.

19న ఏఐటీయూసీ మహాసభ


సీపీఐ కార్యాలయం వద్ద మహాసభ కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చింతలపూడి: ఈ నెల 19న నిర్వహించనున్న ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు కంకిపాటి బుచ్చిబాబు, టి బాబు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద సోమవారం మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1920 నుంచి కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేస్తోందని తెలిపారు. 19న స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించనున్న మహాసభకు కార్మిక అనుబంధ రంగాల కార్మికులు హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా కోశాధికారి చేపల్లి శ్రీనివాసరావు, నక్కా తిరుపతిరావు, కంపసాటి శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

విర్డ్‌లో ముగిసిన ఆర్థోపెడిక్ ప్రత్యేక వైద్య శిబిరం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఈనెల 11న ప్రారంభమైన చారిటబుల్ ఆర్థోపెడిక్ ప్రత్యేక వైద్య శిబిరం, కాన్ఫరెన్స్ సోమవారంతో ముగిసింది. అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యులు కామినేని శ్రీనాధ్ ఆధ్వర్యంలో వైద్య బృందం రోగులకు విశేష సేవలు అందించారు. భుజం, మోచెయ్యి (ఎముక, జాయింట్) సమస్యలతో బాధపడుతున్న 74 మందిని ఈ శిబిరంలో పరీక్షించారు. అందులో 18 మందికి విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించారు. విర్డ్‌లో రోగులకు అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆస్పత్రి ట్రస్టు ఛైర్మన్ ఎస్వీ సుధాకర రావు కోరారు. రోగులకు సేవలు అందించిన వారిలో వైద్యులు భవ్యచంద్, నాగేంద్ర, హమీద్, సింధు, శ్రీనివాస్, బాలాజీ, విహారి, ఆస్పత్రి ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకర్ తదితరులున్నారు.

కుక్కునూరు సీడీపీఓగా కొల్లు వెంకాయమ్మ

కుక్కునూరు: కుక్కునూరు సీడీపీఓగా కొల్లు వెంకాయమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉండేవి, సెంటర్ల పరిధి ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వం కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను కలిపి కొత్తగా ఒక ప్రాజెక్టును ఏర్పాటు చేసి సీడీపీఓను నియమించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సీడీపీఓకు కుక్కునూరు మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవమ్మ, కె.మయూరి, రుక్మిణి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఏర్పాట్లు


బయ్యనగూడెంలో నిర్మించిన రామాలయం

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో నూతనంగా నిర్మించిన రామాలయ (పెద్ద రామాలయం) ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త తుమ్మలపల్లి సూర్యచంద్రరావు పేర్కొన్నారు. 15,16,17 తేదీల్లో ఉత్సవ నిర్వహణ కొనసాగుతుందన్నారు. సుమారు వందేళ్ల నాటి పాత రామాలయం జీర్ణోద్ధారణ చెందడంతో గ్రామస్తుల సహాయంతో దాదాపు రూ.40 లక్షల వ్యయంతో నూతన రామాలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 17వ తేదీ శుక్రవారం ఉదయం 11.18 గంటలకు కోదండరామ సీతా లక్ష్మణ హనుమద్ విగ్రహాలతోపాటు గణపతి, లక్ష్మీనరసింహ విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నట్లు తెలిపారు.

19 నుంచి ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు


ముత్యాలమ్మ ఆలయంలో వార్షికోత్సవాల కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మ తృతీయ వార్షికోత్సవాలు ఈ నెల 19 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళి తెలిపారు. జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మ ఆలయంలో వైద్యురాలు జంగా ఇంద్రాణి, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి వార్షికోత్సవ వేడుకల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ మొదటి రోజు 19వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకి ముత్యాలమ్మ గుడి దగ్గర నుంచి 108 కలశాలతో గ్రామ దేవత గంగాలమ్మ ఆలయం వరకు శోభాయాత్ర, ముత్యాలమ్మ గుడి వరకు వచ్చి సప్త నది జలాలతో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

జీడి తోట దగ్ధం


గంగవరం సమీపంలో దగ్ధం అయిన జీడి మామిడి తోట

కొయ్యలగూడెం: గంగవరంలో జీడి మామిడి తోట సమీపంలోని జామాయిల్ తోట దగ్ధం కావడంతో స్థానిక రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. అగ్నిప్రమాదం సంభవించడానికి గల కారణాలపై రైతులు మాట్లాడుతూ గంగవరం సమీపంలోని కొండ ప్రాంతం నుంచి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి గ్రావెల్ రవాణా గత నెల రోజుల నుంచి కొనసాగుతోందన్నారు. ఈ నేపథ్యంలో రహదారికి అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను, మొక్కలను, తొలగించి పరిసర ప్రాంతాల్లోని రైతులకు చెందిన పంట భూముల్లో వదిలేశారని రైతుల ఆరోపించారు. రాకపోకలు సాగిస్తున్న గ్రీన్ ఫీల్డ్ సిబ్బంది బీడీలు, సిగరెట్లు కాల్చి వదిలేసిన చెట్ల కొమ్మలపై పాడేసారని దాంతో అగ్నిప్రమాదం సంభవించింది అని రైతులు ఆరోపించారు. తమకు నష్టపరిహారం అందించాలంటూ ఆందోళన చేపట్టారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

కామవరపుకోట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకు ఇల్లు దగ్ధమైన ఘటన తడికలపూడిలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల ప్రకారం తడికలపూడిలోని చాకలి బజారులో నివాసముండే దామెర్ల చిననాగయ్య కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి భోజనం చేసి ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో సుమారు 10.30 గంటలకు ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు ఏరియా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా సిబ్బందితో మంటలు అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో పూర్తిగా తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంటిలో కుమార్తె వివాహానికి దాచుకున్న రూ. 25 వేలు, రెండు కాసుల బంగారు వస్తువులు, టీవీ, దుస్తులు, వంట సామగ్రి ఆహుతి అయ్యాయి. బాధితులకు సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, బియ్యం కూరగాయలు అందజేశారు. ఈ కుటుంబానికి రజక వృత్తి జీవనాధారం కావడంతో ప్రభుత్వ సాయం అందేలా కృషి చేస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

జంగారెడ్డిగూడెం: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోకన్వీనర్ విస్సంపల్లి సిద్దు మహాజన్ డిమాండ్ చేశారు. సోమవారం జంగారెడ్డిగూడెం సోషల్ క్లబ్‌లో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోకన్వీనర్ విస్సంపల్లి సిద్దు మహాజన్ అధ్యక్షతన కరపత్రాల ఆవిష్కరణ నిర్వహించారు. కార్యక్రమానికి మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా సమన్వయకర్త బయ్యారపు రాజేశ్వ మాదిగ, కన్వీనర్ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్ సనమండ్ర కనకరాజు మహాజన్ హాజరయ్యారు. మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి 27న మహాజన్ సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో మార్చి 28న చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జుజ్జవరపు వాసు చౌదరి, బొడ్డపాటి పండు, తానింకి వెంకట్, లాగు కిరణ్, మోటమర్రి జగన్ రజక, బొబ్బర అంబేడ్కర్ పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ద్వారకాతిరుమల: ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని కేఆర్ పురం ఏడీఏ పీజీ బుజ్జిబాబు హెచ్చరించారు. మండలంలోని సీహెచ్.పోతేపల్లి గోద్రెజ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వద్ద రైతులకు విక్రయించే ఎరువుల దుకాణాన్ని, పంగిడిగూడెంలోని లక్ష్మీ ట్రేడర్స్, తిరుమలంపాలెం, జి.కొత్తపల్లి లోని సొసైటీ ఎరువుల గోదాములను, వెంకటకృష్ణాపురంలోని గోపాలకృష్ణ ట్రేడర్స్ ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఎరువులను సరైన గోదాముల్లో భద్రపరచాలని సూచించారు. రైతులకు ఈ-పాస్ ద్వారా ఎరువులు అందించాలని, కంపెనీలు ఓ ఫారంను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ.దుర్గారమేష్, గోద్రెజ్ ఫ్యాక్టరీ మేనేజర్ దీపక్ తదితరులున్నారు.

రేషన్ పంపిణీ వివాదంపై విచారణ

టి.నరసాపురం: రేషన్ బియ్యం సరిగా అందడం లేదని లబ్ధిదారులు ఆందోళన చేసిన నేపథ్యంలో సోమవారం టి.నరసాపురం తహసీల్దార్ జేవీ సుబ్బారావు, ఎస్సై కె.సతీష్‌కుమార్ విచారణ నిర్వహించారు. ప్రతీ నెలా ఇచ్చే రేషన్ బియ్యం సక్రమంగా అందడం లేదని ఎంఆర్‌సీ కాలనీ వాసులు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్, ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకుని లబ్ధిదారులతో చర్చించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ బొర్రంపాలెంలో షాపు నెంబర్ 24 పరిధిలో ప్రతి నెలా రేషన్ సరుకులు సక్రమంగా అందడం లేదన్నారు. కొందరికి రెండు మూడు నెలలుగా అందడం లేదని, రెండు రోజుల్లో పంపిణీ ముగియనుండంతో ఈనెల రేషన్ అందదేమో అన్న భయంతో ఆందోళన చేశామన్నారు. దీంతో స్పందించిన తహసీల్దార్ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. లబ్ధిదారుల్లో కొందరికి దగ్గరుండి రేషన్ పంపిణీ చేయించారు. మిగిలిన వారికి రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో రేషన్ అందేలా చూస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ మొహిద్దీన్, వీఆర్‌వో సుబ్బారావు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.